
# గోధూళివేళ

## పి.సత్యవతి




**ఈవారం కథ**

ఓ ఆదివారం మధ్యాహ్నం చినుకుల్లో తడిసి ఇంట్లో అడుగు పెడుతుంటే - అమ్మా నాన్నా వంటింట్లో హడావుడి పడుతూ ఏదో వండుతూ వాదించుకుంటున్నారు. వాదన వంట గురించి కాదు - విద్యా విధానం గురించి - ఆవిడ అధ్యాపకురాలు - ఆయనేమో ప్రొఫెసర్ - ఆవిడ పొయ్యి మీద బాండీ పెట్టి నూనె పోసింది. గిన్నెలో సెనగపిండి వేసి కలుపుతోంది. ఆయన ముక్కు ఎగబీలుస్తూ కళ్ళు తుడుచుకుంటూ ఉల్లిపాయలు కోస్తున్నాడు.

ఆయన భుజంమీద చెయ్యి వేసి, "సాయం కావాలా" అని అడిగాను. వెంటనే మా అమ్మ సెనగ పిండి గిన్నె నా ముందుకి నెట్టి "పకోడీలు వేసెయ్ - నేను పేపర్లు దిద్దుకోవాలి" అని వెళ్ళిపోయింది. మరో భారతమాత అయితే యూనివర్శిటీలో నాలుగేళ్ళ నుంచీ పరిశోధన చేస్తూ అలసిపోతున్న నన్ను యిలా పొయ్యి ముందుకు నెట్టదు - ఈవిడ అదొక తరహా మాత! ఏం చేస్తాం-

"నాక్కొంచెం ఉల్లిపాయలు కోసి పెట్టకూడదూ-" అని నాలుక కరుచుకున్నాడు నాన్న. వెంటనే కళ్ళు కూడా తుడుచుకున్నాడు. తన కుటుంబంలో స్త్రీలెవరూ కంట తడిపెట్టకూడదని - అలా పెట్టనివ్వనని - కనీసం ఉల్లిపాయలు తరుగుతూ కూడా కంటనీరు కార్చరాదనీ - చిన్నతనంలోనే శపథం చేశాడట ఆయన. అమ్మనీ నన్నూ ఉల్లిపాయలు కొయ్యనివ్వడు. ఏదైనా ఊరు వెళ్ళవలసి వస్తే ఓ అరకిలో ఉల్లిపాయలు తరిగి ఫ్రిజ్‌లో పెట్టి వెడతాడు బంగారు నా తండ్రి. దానికో పెద్ద కథ వుందిలెండి.

అసలు మా నాన్నని వాళ్ళ వూళ్ళో అందరూ చెరువు తులశమ్మ గారి మనవడనే పిలుస్తారు. ప్రొఫెసర్ సో అండ్ సో అనరు. చెరువు తులశమ్మ గారంటే మా నాన్న గారి వూరికి మహాలక్ష్మి. అసలు ఆవిడ పేరు మహాలక్ష్మే. కానీ చెరువు తులశమ్మగా పేరు పడి నిలిచిపోయింది.

మహాలక్ష్మమ్మ గారికి ఎనిమిదో ఏట పెళ్ళయింది. అప్పటికి పెళ్ళి కొడుక్కి పదహారేళ్ళట - ఈ ఎనిమిదేళ్ళ గుంట ఎప్పుడు ఈడేరుతుంది, ఎప్పుడు కాపురానికి వస్తుంది అని ఆమె పెనిమిటే కాక, పెనిమిటి నాయనమ్మ, ఇద్దరు ఇల్లుపట్టిన మేనత్తలు, తల్లి ఎదురుచూస్తున్నారు - పదిహేనో ఏట. పైట వేసుకుని ఈవిడ అత్త గారింట్లో కుడిపాదం పెట్టింది. అప్పటికి మొగుడు, నాయనమ్మ, మేనత్తలు, తల్లి పగలంతా ఈవిణ్ణి వంకాయనో చిలకడ దుంపనో కాల్చినట్లు కాల్చుకు తినేవారు - పగలంతా పనితోనూ సాధింపులతోనూ అలసిపోయి రాత్రివేళ ఇన్ని వేన్నీళ్ళు వంటిమీద గుమ్మరించుకుని హాయిగా కునుకు తీద్దామంటే వీల్లేకుండా ఆయన గారి శృంగార దండయాత్ర. అదేమిటో - ఎందుకో అర్థం కాదు - భయం - బాధ - అసహ్యం - ఎవరితో చెప్పుకోవాలి? అమ్మకి ఉత్తరం రాద్దామంటే తనకి రాయడం రాదు - ఆవిడకి చదవడం అసలే రాదు - ఆ



పూర్తించి ఎవరైనా వస్తేనే!

ఎదురు చూడగా చూడగా సంక్రాంతి పండగొచ్చింది – నాన్న వచ్చి ఇద్దర్నీ తీసుకువెళ్ళాడు – ఈయనెందుకు బాబూ అనిపించింది గానీ తప్పదు గదా – వెళ్ళినరోజు సాయంత్రమే అమ్మతో కష్టం సుఖం కలబోసుకుని కన్నీళ్ళు పెట్టుకుంటే ఆవిడ నవ్వేసి "అత్తింటి కాపురం అంటే అచ్చనగాయలు ఆడ్డం అనుకున్నావా? ఆడ పుటకంటే అంతే మరీ – మేం అంతా అల్లా బాధపడ్డవాళ్ళం కామూ? అదే అలవాటౌతుంది–" అని చెప్పి చేగోడీలూ – అరిసెలూ – మడత కాజాలు వండి పెట్టింది – అంతే ఇంక ఎవరితోనూ తన గోడు చెప్పకోలేదు ఆవిడ. సాయంత్రం వేళ పనంతా పూర్తి చేసుకుని పెరటి మధ్యలో వున్న తులసికోట దగ్గర కూర్చుని కరువు తీరా ఏడ్చేది – తన కష్టసుఖాలన్నీ ఆ తులశమ్మ తల్లితో మనవి చేసుకునేది – సాయంత్రం వేళ ఆ ఇంటి కోడలు అలా తులసి గట్టుమీద కూర్చుని ధ్యానంలో మునిగిపోవడం ఇంట్లో వాళ్ళకే గాక బయటి వాళ్ళకి కూడా తెలుసు. ఆవిడ అక్కడ కూర్చుని తులశమ్మను ధ్యానించుకుంటోందని అనుకునేవారు. ఆవిడలా పదేళ్ళ పాటు రోజూ సాయంత్రం అక్కడ కూర్చుండగా కూర్చుండగా ఆవిడ కన్నీళ్ళు తులసికోట చుట్టూ చెరువు అయ్యాయి – ఇంట్లో వాళ్ళకీ ఊళ్ళో వాళ్ళకీ ఆదొక అద్భుతమైంది – మహాలక్ష్మమ్మ ప్రార్థనలకి తులశమ్మ కరిగిపోయి చెరువు సృష్టించిందని తలపోశారు. నాయనమ్మ ప్రతిష్ఠ పెరిగింది –

ఈలోగా ఆవిడకి అయిదుగురు పిల్లలు పుట్టారు. ఇద్దరు ముసలి మేనత్తలు పోయారు. మొగుడి నాయనమ్మ సరేసరి–ముగ్గురు మగపిల్లల్ని వరసగా కనడం – పెరట్లో చెరువు ఏర్పడడానికి కారణం కావడం నాయనమ్మకి అదృష్టాన్ని తెచ్చాయి – ఇంటా బయటా గౌరవం హెచ్చింది – మహా పతివ్రత చెరువు తులశమ్మగా ఆవిడ పేరు ప్రక్క గ్రామాలకి కూడా పాకింది – పూర్వం కార్తీక మాసంలో దీపాలు వదలడానికి వూరి బయట చెరువుకి వెళ్ళే ఆడవాళ్ళు ఇప్పుడు ఈ చెరువుకే రావడం మొదలుపెట్టారు – నాయనమ్మ మొహం చూస్తేనే చాలు అదృష్టం అనుకునేవారు – ఆ చెరువులో ఇంటి ఆడవాళ్ళు స్నానాలు చేసేవారు. మడిబట్టలు ఉతుక్కునే వారు – పిల్లలు ఈత కొట్టేవారు – అయితే తాగడానికి మాత్రం ఉప్పగా వుండేవి నీళ్ళు – పల్లెటూళ్ళే వెయ్యి గజాల కొంపా, లంకంత పెరడూ గనుక చెరువులొచ్చినా వరదలొచ్చినా తట్టుకున్నాయి. పిటీల్లో అలాంటివి జరిగితే గదుల్లో పడవలేసుకుని తిరగాలి కదాని మా నాన్న చిన్నప్పుడే ఈ ఉల్లిపాయల శపథం తీసుకున్నాడు.

మూనె మరిగిపోతోంది – పెసగ పిండిలో ఉల్లిపాయలు కలిపి కొంచెం వంట సోడా కూడా కలిపి చిన్నచిన్న వుండలుగా చేసుకోవాలి – వాటిని మరిగే మూనెలో దోరగా వేయించాలి – అంటే బంగారం రంగు వచ్చేదాకా వేయించాలి – చిల్లుల గరిటలో మూనె ఓడ్చి తియ్యాలి. (అలా తీసేటప్పుడు వేడివేడి మూనె చిందులు వంటిమీద పడితే ఎగిరి గంతులు వెయ్యాలి.)

ఈ వారం కథ



ఇవ్వదు ఘుమఘుమలాడే – సారీ – కరకరలాడే పకోడీలు తయార్.

'వెధవ శపథాలూ నువ్వూనూ – ముక్కూ మొహం ఏకమై పోయాయి – వెళ్ళి మొహమూ చేతులూ కదుక్కు వచ్చి మరీ పకోడీలు తిను–" అని అమ్మ ముద్దుగా కోప్పడుతోంది ఆయన్ని.

"నాన్నా వాళ్ళ నాయనమ్మ చాలా గొప్పది–" అన్నాను అమ్మ ముందు పకోడీల ప్లేటు పెట్టి – ఆవిడ నావైపు ఒకసారి చూసి పేపర్లు దిద్దుకుంటూ పకోడీలు తినడం మొదలుపెట్టింది–

"పేపర్లు నేను కూడా చూసి పెడతాను గానీ – ఈ ఆదివారం ఇల్లా చినుకులు పడుతుండగా మీ నాయనమ్మని గురించి చెబుదూ"–అన్నాను.

నాన్నయితే అడిగినా అడక్కపోయినా తన గురించి తెగ చెప్పేస్తాడు. ఈవిడలా కాదు. అడిగించుకుని అడిగించుకుని గానీ చెప్పదు – చెప్పేవాళ్ళకి అడిగే వాళ్ళెప్పుడూ లోకువేనట కదా–

"చెప్పు తల్లీ – మీ నాయనమ్మ తన పాతివ్రత్య మహిమతో ఏ అద్భుతాలు సృష్టించింది? చెరువులా? నదులా? సముద్రాలా?" అన్నాను–

"వాళ్ళ వంశంలో ఇలాంటి అద్భుత చరిత్రలు లేవు" అన్నారు ప్రొఫెసర్ గారు వెంటనే.

"మా నాయనమ్మకి కన్నీళ్ళంటే అశుభం–ఆవిడ మా తాతయ్య పోయినప్పుడు తప్ప ఎన్నడూ కంట తడిపెట్టలేదు. అప్పుడు కూడా ఆవిడ ఇప్పుడు ఏడవడం శుభమా కాదా అని ఓ క్షణం తటపటాయించి ఏడవకపోవడం అశుభం అని ఎవరో చెప్తేగా గబగబా ఏడ్చేసిందంటారు–"

"ఆవిడకి కష్టాలుండేవి కాదేమో – అత్తలు – మేనత్తలు ఆడబడుచులు – మొగుడు అంతా బాగా చూసే వాళ్ళేమో–"

"అదేం కాదు – అవ్వన్నీ ఆవిడకీ వున్నాయి – ఆవిణ్ణి కాపురానికి పంపేటప్పుడు వాళ్ళమ్మ గట్టిగా చెప్పి పంపింది. ఇల్లాలు కంట తడిపెడితే ఇంట్లో సిరి వుండదు. లక్ష్మీదేవికి ఏడ్చేవాళ్ళంటే అసహ్యం అని – ఆడది ఎప్పుడూ చక్కగా తలదువ్వుకుని బొట్టుపెట్టుకుని నవ్వుతూ వుండాలి – కంట తడిపెట్టడం అశుభం అని – అందుకోసం అని నాయనమ్మ కాపురానికి వస్తూనే కంట తడిపెట్టకూడదని శపథం చేసుకుని మరీ వచ్చింది – పైగా ఆవిడకి అంతులేనన్ని నమ్మకాలు – ప్రొద్దున్నే లక్ష్మీదేవి తలుపు తట్టేవేళ ఇల్లంతా శుభ్రంగా వుండాలి – మనుష్యులు నవ్వుతూ వుండాలి – మధ్యాహ్నం పని వేళ – సాయంత్రం అసుర సంధ్య వేళ – దీపాలు పెట్టే వేళ – ఇల్లా ఆవిడకి ప్రతిదానికీ ఏదో ఒక 'వేళ' వుండేది – ఆ 'వేళ'లో ఏడవరాదు ఎవర్నీ తిట్టరాదు – అపశకునాలు పలకరాదు – పైన తథాస్తు దేవతలుంటారు – మనం ఎవర్నైనా తిడితే వాళ్ళూ 'తథాస్తు' అంటారు – అందుకని ఎప్పుడూ మంచి మాటలే మాట్లాడుతూ వుండాలి – ఏమీ పనిలేకపోతే చేటలో బియ్యం పోసుకుని 'రామరామ' అంటూ ఒక్కొక్క గింజా ఏరి ప్రక్కన పెట్టాలి – ఆ ఏరిన రామనామం బియ్యం గింజలు దానం చెయ్యాలి – మా మేనత్త మా చిన్నతనంలోనే భర్తని పోగొట్టుకుని మా యింటి కొచ్చింది – ఆవిడకి పిల్లలు లేరు

ఇంక చాలా అన్నట్లు ఆవిడ కుర్చీలో నుంచి లేవబోతే బలవంతాన కూర్చోపెట్టి "చాలదు–ఇంకా చెప్పు–" అన్నాను–

"మా నాయనమ్మ ఎప్పుడూ ప్రస్తావించే వేళల్లో 'గోధూళివేళ' ఒకటి–అదిమాత్రం నేనెప్పుడూ మర్చిపోలేను–నువ్వూ మర్చిపో లేవు–" అంది.

చెబుతుందేమోనని ఆశగా మొహంలోకి చూస్తే – లేచి పళ్ళెంలో మరికొన్ని పకోడీలు వేసుకొచ్చి "మీ ఇద్దరూ తినండి" అంది మాకు శిక్ష వేస్తున్నట్టు.

"నువ్వెందుకు తినవు?" అని నిగ్గదీశాడు మా నాన్న.

"తినవని నీతో చెప్పానా? అన్నానా? ఎప్పుడైనా?" అని పాత సినిమా పాట రాగంలో తీసింది–

"నాన్నమ్మకి అక్షరాలు రావు – అంకెలూ రావు – వాటితో ఆవిడకేం పని లేదు – ఇంట్లోకి ఏం కావాలన్నా పిల్లల్తో చెబితే, వాళ్ళు తాతయ్యకి చెప్పేవాళ్ళు – వెంటనే ఆయన అన్నీ తెచ్చి వంట ఇంటి గుమ్మంలో పడేసే వాడు – డబ్బు ట్రాన్సాక్షన్‌తో ఆవిడకేం పని లేదు – అసలు వాటిని గుర్తు పట్టడం కూడా తెలీదు. ఓసారి పొలంలో పని చేసే రైతు ఒకాయన పది రూపాయల నోట్ల కట్ట తెచ్చి ఆవిడ చేతికిచ్చి దాచిపెట్టమన్నాట్ట – ఈవిడ దాన్ని చూర్లో పెట్టింది – మూడో రోజు ఆయన డబ్బు అడిగేసరికి అది కాస్తా ఎలికలు కొట్టేశాయి – నూట యాభై రూపాయలంటే ఆ రోజుల్లో పది కాసుల బంగారం వచ్చేదట – తాతయ్య శివతాండవం చేశాడు –ఈవిడేదో చెప్పబోతే చెంప చెళ్ళుమనిపించాడు – 'మిట్ట మధ్యాహ్నం వేళ' – ఈవిడ వంట ఇంట్లోకి వెళ్ళిపోయి రామకోటి బియ్యం చేట ముందు కూర్చుంది – మా అత్తయ్య ఆవిడ దగ్గర చేరి, "నాన్న మరీనూ–" అనబోయిందట – ఈవిడ వెంటనే, "ఆ మహారాజున్నేం అనకు – తప్పు చేస్తే దేవుడు మాత్రం శిక్షించడా ఏం?" అంది. ఆవిడ పచ్చని పసిమి – బుగ్గలమీద ఎర్రగా తేలిన వేళ్ళు చూసి అత్తయ్యకి కోపం – ఏడుపూ వచ్చాయి – ఏడిస్తే తల్లి తిడుతుందని అక్కడ నుంచీ లేచిపోయిందట–"

"ఆహా!"

"ఓరోజు సాయంత్రం మా అత్తయ్య పది లాంతర్లూ పదిహేను బుడ్డిదీపాలూ చుట్టూ పెట్టుకుని ఓ మసి గుడ్డా గుప్పెడు ముగ్గూ తెచ్చుకుని నడిమి హాల్లో సెటిలైపోయింది. ఆవిడ ప్రతిరోజూ సాయంత్రం ఒక గంటసేపు ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. ఆ సమయంలో అమ్మ సాయంత్రం వంటకి కూరలు కోసుకుంటూనో, పొలం నుంచి వచ్చిన జీతగాడికి అన్నం పెడుతూనో – అతగాడి చేత ఉలవలు రుబ్బిస్తూనో పెరట్లో వుంటుంది – నాయనమ్మ అత్తయ్య ప్రక్కనే స్థంభాన్నానుకుని కూర్చుంటుంది. ఇద్దరూ ముచ్చట్లు పెట్టుకుంటారు – అవి ఒక్కోసారి అమ్మ మీద సాదీలుగానో, ఒక్కొక్కసారి వాళ్ళిద్దరి మధ్య దెప్పళ్ళు – సాధింపులుగానో, ఇంకోసారి వూరి వారిని గురించి విమర్శలు ప్రశంసలుగానో వుంటాయి. అది బాగా 'హడావుడి వేళ' – మేం స్కూల్ నుంచి వచ్చే వేళ కూడా.

"లాంతర్లు నేనూ తుడవనా అత్తయ్యా–" అన్నాను, స్కూల్ నుంచి వచ్చి అమ్మ పెట్టినవి 'రెండు'తో పాటు కారప్పూస కూడా తినేసి వచ్చి–

"ఏడిశావ్ లే వెళ్ళి స్నానం చెయ్యి–" అంది అత్తయ్య–

"ఆడపిల్లని అల్లా ఏ వేళప్పుడు బడితే ఆ వేళ ఏడిశావ్ లే అనకూడదు – తప్పు–" అంది నాయనమ్మ.

"ఈవిడకేదన్నా తప్పే–" అని గొణుక్కుంది అత్తయ్య.

"గొడ్లు ఇంటికి వచ్చినయ్యా–" అంది నాయనమ్మ వుండీ

వుండీ.

గొడ్లు యింటికి రాగానే ఆవిడ తను రోజా పూజ చేసే ఆవు దగ్గర స్వయంగా పాలు పితుకుతుంది – రాత్రి పూట తాతయ్య కోసం – ఆయుర్వేదం మందుతో ఆవుపాలు తాగుతాడు ఆయన. దూడకి ఎన్ని వదలాలో, మనం ఎన్ని పిండుకోవాలో జీతగాడికి తెలియదని ఆవిడ ఉద్దేశ్యం – తాతయ్యకి కావల్సినవి గ్లాసెడు. దేవుడి నైవేద్యానికి మరో గ్లాసెడు. అంత మాత్రమే పిండి మిగతావి దూడకి వదిలెయ్యాలి – ఈ రెండు గ్లాసులు పట్టేదానికి చెంబులో ఈవిడకో కొలత కూడా వుంది – ఒక్క చెంచా అటూ ఇటూ అయినా సహించదు – దూడల ప్రాణం తీసేశావంటుంది.

“గొడ్లు ఇంటికి వచ్చే వేళని ఏ వేళంటారు నాన్నమ్మా” అన్నాను సరదాకి.

“గోధూళి వేళంటారే – అదీ తెలీదూ – పెద్ద మనిషయ్యాక కూడా చదివేస్తున్నావూ?” అని దీర్ఘం తీసింది – ఆవిడకి నచ్చని విషయాల్లో పెద్ద మనిషయ్యాక నేను చదువుకోవడం కూడా ఒకటి.

“అంటే ఏమిటి నాయనమ్మా–”

“గోవులన్నీ ఇంటికి హడావుడిగా పరిగెత్తుకుంటూ వస్తూంటే – వాటి అడుగులకి దుమ్మురేగి ఆకాశం అంతా ఎర్రగా అయిపోతుందట – అందుకే గోధూళి వేళ అన్నారు.”

“గోవులొక్కటేనా – ఎద్దులూ వస్తాయి – గేదెలూ వస్తాయి – కదూ – వృషభ ధూళి వేళ – అని ఎందుకనరూ?” అన్నాను.

“గోవులు వేళకి ఇంటికి రావడం ముఖ్యం – దూడలు పాల కోసం ఎదురు చూస్తుంటాయి – మనం పెందలాడి పాలు పితుక్కోవాలి – చీకటి పడితే ‘కాష్టం’లో పురుగూ పుట్రా వుంటాయి – గోవులకి ఇంటి దగ్గర చాలా పనులున్నాయి – అవి వేళకి ఇంటికి రావడం మనకి అవసరం. అందుకే గబగబా వాటి వేళకి అవి పరిగెత్తుకు వస్తాయి–” అని అత్తయ్య వ్యాఖ్యానించింది.

“అంటే ఎద్దులకన్న ఆవులే ఎక్కువ ఉపయోగం అందుకే మనం వాటికి పూజ చేస్తాం – కదా నాయనమ్మా” అన్నాను.

నాయనమ్మ వొప్పుకోలేదు “ఎద్దులూ పొలం దున్నుతాయి – బండి లాగుతాయి – అవి లేకపోతే నీకు తిండి ఎక్కడిదో! అందుకని ఎద్దులే గొప్పవి – గోవు – సహనానికి పేరు – గోమాత అంటాం – తల్లి లాంటిది – సహన దేవత – అందుకే పూజ చేస్తాం” అంది నాయనమ్మ – అనేసి, గోవు ఇంకా ఇంటికొచ్చిందో లేదో చూడ్డానికి పెరట్లోకి వెళ్ళిపోయింది – ‘గోధూళి వేళ’ అనే మాట మాత్రం నా మనస్సులో నాటుకుపోయింది – నేనెప్పుడూ మర్చిపోలేను – ఈ పేపర్లలో మార్కులు కూడా – టోటల్స్ వేసెయ్ – అయిదింటికి నాకు బయటికి వెళ్ళే పనుంది–” ఆవిడ్ని ఒక్క క్షణం ఆపడం మన తరం కాదు. ఇదంతా జరిగి రెండేళ్ళయింది.

* * *

లాస్ట్ అవర్ జరుగుతోంది – అది లేని వాళ్ళం స్టాఫ్ రూంలో కూర్చున్నాం – కొందరు షేర్ మార్కెట్ గురించీ – కొందరు ప్రిన్సిపాల్ గురించీ మాట్లాడుకుంటున్నారు. పాలిటెక్స్ సంధ్యారాణి తడవ తడవకి గేటు ప్రక్కనున్న గంటకేసి చూస్తోంది. ఆవిడ రెండు బస్సులు మారి ఇంటికి వెళ్ళాలి. రష్ అవర్ కదా బస్సులు దొరకవు. ఇంటి దగ్గర ఆవిడకి అర్జెంటు పనులు ఎప్పుడూ వుంటాయి. బాటనీ పుష్పలత తన కొడుక్కి జ్వరం తగ్గడం లేదని చెబుతోంది. ఈరోజు స్పెషలిస్ట్‌తో ఎపాయింట్‌మెంట్ వుందట. తెలుగు శివరావుగార్ని లిఫ్ట్ అడిగితే ఆయన డైరెక్ట్‌గా ఇంటికి వెళ్ళనని చెబుతున్నాడు. దార్లో ఎవరికో సంస్కృతం ట్యూషన్ చెప్పాలట. ఏ ఎనిమిదింటికో గానీ ఇంటికి చేరడట. బజార్లో పన్లూ అవీ చూసుకుని మిత్రబృందాన్నోసారి దర్శించుకుని గానీ వెళ్ళనని ధీమాగా చెబుతున్నాడు.

“అవును బ్రదర్ – ఇంటికి వెళ్ళి మళ్ళీ రావాలంటే బోలెడు పెట్రోలు దండగ – దార్లో పన్లు చూసుకువెళ్ళడమే హాయి – ఇంటికి వెళ్ళి తినేసి టి.వి. చూడ్డమే గదా” అన్నాడింకోయన.

సంధ్యారాణి గంటకేసి చూస్తూనే వుంది. పుష్పలత దిగాలుగా కుర్చీకి చేరబడింది – ఇంటికి వెళ్ళి కొడుకుని తీసుకుని హాస్పిటల్‌కి వెళ్ళేసరికి టైం అయిపోతుందేమో – ఎపాయింట్‌మెంట్ వేళ దాటితే ఆఖరు పేషెంట్ దాకా తను నిరీక్షించాలి. అప్పుడుగానీ చూడదు డాక్టర్ – రాత్రి పది దాటుతుంది. వంటా గింటా ఎలాగ?

ఎట్టకేలకు బెల్ మోగింది – సంధ్యారాణి అప్పటికే బ్యాగ్ సర్దేసుకుని వుందేమో ఒక్క పరుగున గేటు దాటింది. పుష్పలత అప్పుడే క్లాసు నుంచి వచ్చిన ఇంగ్లీషు సుబ్బారావు గార్ని సగం దూరం లిఫ్ట్ అడిగి విజయం సాధించిన దానిలా ఆయన స్కూటర్ ఎక్కేసింది. షేర్ మార్కెట్ గురించి మాట్లాడుతున్న సుందర్రావూ, సూర్యముఖీ పుష్పలత ‘లిఫ్ట్’ అడగడాన్ని గురించి జోక్‌లు వేసుకుని నవ్వుకున్నారు – నేనూ తెలుగు సునందా తాపీగా నడుచుకుంటూ బస్టాప్‌కి వచ్చాం – బస్టాప్ నిండా అమ్మాయిలే – వాళ్ళ మొహాల్లో అంతులేని ఆతృత. రోడ్డు మీద – హడావుడిగా వెళ్ళే వాహనాలు కూడా అమ్మాయిలవే – ఇల్లు చేరాలి – వీలైనంత త్వరగా – ఇంటి దగ్గర పని – పిల్లలు – స్కూలు, ఆఫీసు, కాలేజీ, యూనివర్సిటీ, వదిలి ఇంతసేపైతే ఏమిటి ఆలస్యం! ఏం చేశావింత సేపు! త్వరగా రావాలని తెలీదూ! ఇంతమందికి దొరికిన బస్ నీకు దొరకదా! సుధారాణి తోసుకుంటూ త్రొక్కుకుంటూ బస్సెక్కేసింది. అమ్మయ్య! ఇవ్వాల్టికి గండం గడిచింది–

“ఈ హడావుడిలో ఎక్కలేం బాబూ – ఓ రెండు బస్‌లు పోనీ – ఆనక ఎక్కుదాం – ఈలోగా ఆ బండీ మీద కండెలు కొనుక్కొచ్చుకుందాం పద” అంది సునంద – స్టూడెంట్సెవ్వరూ దరిదాపుల్లో లేరని గ్రహించి. అంతలో అంత నిండాలేని బస్ ఒకటి వచ్చింది – ఎక్కేశాం యిద్దరం.

ఈ వేళప్పుడు ఎక్కడ చూసినా ఆడవాళ్ళు! ఆడవాళ్ళు – ఈరోజు ఉద్యోగం సంతృప్తికరంగా చేశాం – గుండె దడ లేకుండా తాపీగా ఇంటికి వెడదాం – దారిలో ఒక ఫ్రెండ్‌ని పలకరించాలన్నా నిదానం ఎవరి మొహంలోనూ కనపడదు. త్వరగా – త్వరగా – దారిలో కూరలు – పిల్లలకి చిరుతిళ్ళు – వృద్ధులకి మందులు కొనడానికి ఓ అరగంట పడితే దానికి సంజాయిషీ వుంటుంది – బస్సులు అందకపోతేనూ – ఫ్రెండ్‌ని పలకరిస్తేనూ సంజాయిషీ లేదు – పదండి – ముందుకు – పదండి తోసుకు – పదండి త్రొక్కుతు – పదండి బస్సుల్లోకి – ఎక్కండి త్వరగా – ఊ ఇంకా త్వరగా.

“ఏమి ఆతృతో ఏమిటో – ఈ ఆడవాళ్ళకి ఇంటికి వెళ్ళడానికి” అన్నాను నేను స్వగతంలాగు – “గోధూళి వేళయింది కదా!” అంది తెలుగు సునంద చాలా మామూలుగా.



